మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక



పార్లమెంట్ సాక్షిగా
## అబద్ధాలు
- వికృతత్వాన్ని బయటపెట్టుకున్న కిషన్ రెడ్డి
- మాజీ మంత్రి హరీష్ రావు

3 లో

సంపుటి : 01 | సంచిక : 127 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం, 03 ఏప్రిల్ 2026 | పేజీలు : 4



# లో జ్వరమైనా హైడోస్!

- జనగామలో డాక్టర్ల నిర్వాకం
- ధనార్జనే ధ్యేయంగా వైద్యం
- చిన్నారుల ఇమ్యూనిటీపై ప్రభావం

'వైద్యో నారాయణో హరి..' అంటే వైద్యుడు సాక్షాత్తూ ఆ నారాయణుడితో సమానమని అర్థం. అనారోగ్యంతో ఉన్న వారి ప్రాణాలను కాపాడే డాక్టర్లను దేవుడిగా భావిస్తారు.. కానీ.. కొందరు ప్రబుద్ధులు మాత్రం పవిత్ర వైద్య వృత్తిని ధనార్జనే ధ్యేయంగా పెట్టుకుంటున్నారు. అనారోగ్యంతో వచ్చిన రోగిని నిలువు దోపిడీ చేస్తూ కాసుల పంట పండించుకుంటున్నారు. చిన్నారులకు మామూలు జ్వరం, జలుబు లాంటి సమస్యలకు కూడా ఎక్కువ రేట్లు ఉన్న హైడోస్ మెడిసిన్ ఇస్తూ డబ్బులు దండుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఆ ప్రబుద్ధులపై ప్రత్యేక కథనం.. మళి సంచికలో.. *- మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి*



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఘన్‌పూర్‌ను
## మొదటి స్థానంలో నిలవాలి
- 6 నుండి 12 వరకు గ్రామాలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి
- నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

2 లో

## రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలు
- సభల్లో సీఎం రేవంత్ సందేశం విడుదల

**హైదరాబాద్, మన చౌరాస్తా** : ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా రాష్ట్రమంతటా గ్రామ సభలు జరుగుతున్నాయి . సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సందేశం అందించారు. గ్రామ సభల్లో అధికారులు ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపిస్తారు. ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాల మూడునెలలు పూర్తయ్యింది. ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ, గత పాలకుల తప్పిదాలను సరిచేస్తూ... సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీపడకుండా మన ప్రభుత్వం పని చేస్తోంది. మేం పాలకులం కాదు... సేవకులం అన్న భావనతో ప్రజల ఆకాంక్షలు, అవసరాలే కేంద్ర బిందువుగా నిత్యం శ్రమిస్తున్నాం. ప్రతి నిర్ణయంలో ప్రజల మేలు, సామాజిక బాధ్యత, రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుంటున్నాం.ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో వరుస విజయాలతో ప్రజా పాలనకు మీ ఆమోదం, మద్ధతు ప్రకటించారు.జ మీరు ఇచ్చిన ఈ ఫలితాలు మా బాధ్యతను మరింత పెంచాయి. ప్రభుత్వ పథకాలు అంటే కాగితాలపై కాదు... ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తేవాలన్నది మా సంకల్పం. ఆ ఉద్దేశంతోనే 'ప్రజాపాలన` ప్రగతిప్రణాళిక' పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించాం. మార్చి 6 నుండి 99 రోజుల పాటు, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు, అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం ఒక ఉద్యమంలా సాగాలి. ఊరు వాడ సమస్యల పరిష్కారమే పరమావధిగా ప్రతి అధికారి పని చేయాలి. వేగంగా ఫైళ్ల క్లియరెన్స్, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత, నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలి. మహాలక్ష్మి... ఉచిత బస్సుసౌకర్యం, 500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు, మహిళా సాధికారత వంటి పథకాలు అర్హులకు చేరేలా ఈ కార్యక్రమం జరగాలి. తెలంగాణ రైజింగ్ 2047' విజన్ తో ఆర్థికం



గానే కాక, అన్నీ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలో నెంబర్ వన్ గా నిలపాలన్నది మన సంకల్పం. ఈ సంకల్పంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి. క్యూర్,ప్యూర్, రేర్‌గా రాష్ట్రాన్ని వర్గీకరించుకున్నాం. వాటి పరిధిలో సేవా, తయారీ, వ్యవసాయ రంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా మనం ఎదగాలి. 99 రోజుల కార్యాచరణ ఒక సాధారణ కార్యక్రమం కాదు.. ఒక దీక్ష. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఒక్కటై... దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా ఎదగాలి. ఇదే నా కల. ఆ కలను సాకారం చేయడంలో ప్రతి తెలంగాణ బిడ్డ భాగస్వామి కావాలి. మీ అందరి సహకారాన్ని కోరుకుంటూ మీ రేవంత్ రెడ్డి అన్న సందేశాన్ని విడుదల చేశారు.

wanted
విలేకరులు కావలెను
మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సప్రదించగలరు.
manachourasta@gmail.com
8555800812 9676400812
సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..
మన చౌరాస్తా
The Complete News way




# సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**తరిగొప్పుల, మన చౌరాస్తా :** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లాలోని తరిగొప్పుల మండలంలోని తరిగొప్పుల గ్రామ పరిధిలో గల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా రాష్ట్ర గీతాన్ని ఆలపించి, ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును క్షుణ్ణంగా వివరించారు. రైతు రుణ మాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సభ్యులకు మంజూరైన వడ్డీ లేని రుణాల వివరాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్ బుక్కులు, సన్న బియ్యం పంపిణీ, వైద్య సేవలు, తదితర పథకాలకు సంబంధించి లబ్ధిదారుల పూర్తి వివరాలను గ్రామ ప్రజలకు తెలియజేశారు. అదే విధంగా నూతన పథకాలైన ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, మధ్యాహ్న భోజన పథకం ఇంటర్మీడియట్ కు విస్తరణ, విభిన్న ప్రతిభావంత ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోటారు వాహనాలు, పంటల వైవిధ్యం, సహజ సేంద్రీయ వ్యవసాయం పథకాలపై అవగాహన కల్పించారు. అలాగే వివిధ పథకాల లబ్ధిదారులు ఈ సందర్భంగా వారి అభిప్రాయాలను తెలియజేస్తూ.. ప్రజా ప్రభుత్వంలో నిరుపేద లైన తమకి వివిధ రకాల సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను కలెక్టర్ నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ స్థాయిలోనే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసా, గృహ జ్యోతి, మహాలక్ష్మి వంటి పథకాలు ప్రజలకు చేరేలా అధికారులు కృషి చేస్తున్నారని, అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు. గ్రామ సభలో ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులు నమోదు చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజల భాగస్వామ్యం కీలకమని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, పిల్లల విద్యపై దృష్టి పెట్టడం, ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోసిన్, మండల ప్రత్యేక అధికారి రాణా ప్రతాప్, గ్రామ సర్పంచ్ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్, అంబేద్కర్ జయంతి ఏర్పాట్లపై సమీక్ష

జనగామ, మన చౌరాస్తా : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, సంఘ సంస్కరణల కోసం కృషి చేసిన బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి, అంబేద్కర్ జయంతి వేడుకలకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై డీసీపీ రాజా మహేంద్ర నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వివిధ కుల సంఘాల ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 5న బాబు జగ్జీవన్ రామ్ జయంతి, అలాగే 14వ తేదీన బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ లు సమాజ సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసిన సేవలను గుర్తు చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. వారి ఆశయాలకు అనుగుణంగా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. జయంతి రోజున వారి విగ్రహాలకు పుష్పాంజలి ఘటించడం, శుభ్రత కార్యక్రమాలు నిర్వహించడం, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం వంటి కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. వేడుకల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా బాధ్యతాయుతంగా పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎస్సీ సంక్షేమ అధికారి విక్రమ్, ఆర్డీఓ గోపీరాం, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, కుల సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.





# జాతీయ స్థాయి క్రీడా పోటీలకు తొర్రూరు విద్యార్థులు

**పాలకుర్తి, మన చౌరాస్తా :** ఈ నెల 3 నుండి 6వ తేదీ వరకు మహారాష్ట్రలోని పూణెలో 35వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. తెలంగాణ కబడ్డీ జట్టుకు జడ్పీహెచ్ఎస్ తొర్రూరు (J) పాఠశాల విద్యార్థిని పశులాది నవ్య, ZPHS చెన్నూరు పాఠశాల విద్యార్థిని అంజలి ఎపికైనారు. జనగామ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మెన్ చిట్ల ఉపేందర్ రెడ్డి, గౌరవ సలహాదారుడు, మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ చైర్పర్సన్ గంటా రవీందర్, MEO పోతుగంటి నర్సయ్య, డా. కన్నన్ మాచర్ల బిక్షపతి, లీగల్ అడ్వైసర్ కొయ్యడ మల్లేశ్, అధ్యక్షులు గార్ల మల్లికార్జున్, సెక్రెటరీ మారపాక రాజయ్య, ఉపాధ్యాక్షులు కూటికంటి శ్రీనివాస్, పాలకుర్తి మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు సభ్యులు, యువ చైతన్య క్రీడా మండలి అధ్యక్ష కార్యదర్శులు సభ్యులు, ఇరు గ్రామాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో

# మొదటి స్థానంలో నిలవాలి

- **6 నుండి 12 వరకు గ్రామాలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి**
- **నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి**
- **స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**జనగామ, మన చౌరాస్తా :** మంజూరైన ప్రతి ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ఏప్రిల్, మే ఈ రెండు నెలల వర్కింగ్ సీజన్ లోనే మొదటి విడత ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గృహ నిర్మాణ శాఖ అధికారులకు సూచించారు. గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గానికి సంబంధించి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై మండలాల వారీగా గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాష్ట్ర స్థాయిలో ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గానికి మంచి పేరు తీసుకు రావాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇంటి నిర్మాణం వేగవంతంగా అయ్యేందుకు తీసుకోవలసిన చర్యలను తెలుసుకొని, ఆ దిశగా కృషి చేయాలన్నారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, ఇళ్ల నిర్మాణాల విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే తెలుసుకొని, అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులచే వెంటనే గృహ ప్రవేశం చేయించాలన్నారు. రోజుకు రెండు గ్రామాల చొప్పున కార్యాచరణ ప్రణాళికతో ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షించాలన్నారు. 15రోజులలో మరోసారి సమీక్షా సమావేశ ఉంటుందని ఆ సమావేశానికి పూర్తి స్థాయి నివేదికతో రావాలని సూచించారు. మే 31 డెడ్ లైన్ గా పెట్టుకొని మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఒక్క ఇల్లు కూడా కట్టుకోకుండా ఉండద్దన్నారు అనంతరం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. పేదల గృహ స్వప్నాన్ని సాకారం చేయడం ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులకు త్వరగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటివరకు పూర్తి చేసిన ఇళ్ల సంఖ్య, నిర్మాణంలో ఉన్న ఇళ్లు, ఇంకా ప్రారంభం కాని ఇళ్ల వివరాలను సమీక్షించి, పనులు నెమ్మదిగా ఉన్న చోట వేగం పెంచాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, లబ్ధిదారులతో నిరంతరం సంప్రదింపులు జరిపి పనులను సమయానికి పూర్తి చేయాలని తెలిపారు. పనుల పర్యవేక్షణను కట్టుదిట్టంగా నిర్వహించాలని, ప్రతి దశలో బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో గృహ నిర్మాణ పీడీ మాత్రు నాయక్, ఆయా మండలాల ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలోని 14వ వార్డులో గురువారం 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' సభను ఘనంగా నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ తిరువాయిపాడి అండాలు అధ్యక్షతన స్థానిక అంబేద్కర్ నగర్ కమిటీ హాల్ లో జరిగిన ఈ సమావేశంలో వార్డు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ అండాలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మక పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ సభ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. వార్డు అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, స్థానికంగా ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తాము నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, రూ. 500 గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి. పెంచిన పెన్షన్ల పథకాల గురించి ప్రజలకు సమగ్రంగా వివరించారు. సంక్షేమ పథకాల అమలులో ఎటువంటి అవకతవకలు జరగకుండా, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరిగేలా పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు.ప్రజా పాలన వేదిక ద్వారా ప్రజల నుంచి అందిన వినతులను పరిశీలించి, వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# పాపన్న గౌడ్ త్యాగ స్ఫూర్తి యువతకు ఆదర్శం

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జనగామ, మన చౌరాస్తా : జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సామాజిక సమానత్వం, న్యాయం కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. పాపన్న గౌడ్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమనిఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని సూచించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలను స్మరించుకోవడం ద్వారా సమాజంలో మంచి విలువలు పెంపొందుతాయని కలెక్టర్ తెలిపారు. అనంతరం అధికారులు, సిబ్బంది కూడా పాపన్న



గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు సమర్పించారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎన్. ఎల్. నరసింహ రావు, ఏబీసీడీఓ రవీందర్, డీఎల్పీఓ (ఇంచార్జి ) వెంకట్ రెడ్డి, దిశ కమిటీ సభ్యులు బక్క శ్రీనివాస్, బీసీ కుర్మ సంఘం జనరల్ సెక్రటరీ జోయ మల్లేష్, వైద్యులు బిక్షపతి, బీసీ జేఏసీ అధ్యక్షులు, వసతి గృహ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# సర్దార్ సర్వాయి పాపన్నకు ఘన నివాళి

**పాలకుర్తి, మన చౌరాస్తా :** జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316 వర్ధంతి సందర్భంగా బీసి సంక్షేమ సంఘం నియోజకవర్గం ఇంచార్జ్,గౌడ సంఘం రాష్ట్ర నాయకులు పులి గణేష్ గౌడ్, గిరగాని కుమారస్వామి గౌడ్,పాలకుర్తి సర్పంచ్ కమ్మగాని విజయనాగన్న గౌడ్ లు మంగళవారం గౌడ సంఘం నాయకులతో కలిసి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కాంస్య విగ్రహనికి పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మూల వెంకన్న గౌడ్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ట్రస్ట్ చైర్మన్, పోషాల వెంకన్న గౌడ్ మల్లంపల్లి సర్పంచ్, సంఘీ వెంకన్న యాదవ్ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు, జలగం కుమార్ ఎస్సీ విభాగం జిల్లా నాయకులు, చిట్యాల సోమన్న, ముసుకు సుధాకర్ అయ్యంగార్ పల్లి సర్పంచ్, బొమ్మగాని భాస్కర్, కమ్మగాని మహేష్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, గిలకత్తుల శంకరయ్య, సుధాకర్, కార్పోతుల వెంకటయ్య, దాసరి యాకయ్య, గాదేపాక ఎల్లయ్య, గాయాల సాలయ్య, గోగుల సంపత్, గణపురం ఎల్లయ్య తదితరులు పాల్గొని ఘన న ిహాళులర్పించారు.


# కాళేశ్వరం పేరుతో ప్రజాధనం లూటీ

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, మన చౌరాస్తా :** రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా గత బీఆరఎస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాలేశ్వరం ప్రాజెక్ట్ కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందన్నారు. కాలేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగాయన్నారు. కాలేశ్వరం వల్ల ఉగయోగం లేదని నివేదికలు చెప్పాయని తెలిపారు. కాళేశ్వరం ప్రజల డబ్బుతో కట్టారా? లేక కేసీఆర్ సొంత డబ్బుతో కట్టారా అంటూ ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి నిధులు తీసుకొని కాలేశ్వరం నిర్మించారని కేంద్ర మంత్రి తెలిపారు. భద్రాచలంలో ఉన్న గ్రామాలు ఏపీ పునర్విభజన చట్టంలో చేర్చారని... అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. ఎన్నికల ముందు కాలేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణ జరిపి కేసీఆర్‌ను జైలుకు పంపిస్తామని కాంగ్రెస్ చెప్పిందని.. మాజీ సీఎంపై ఎందుకు విచారణ జరపలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిలదీశారు. ఈ క్రమంలో కాళేశ్వరం అంశంపై రాజ్యసభలో బీఆరఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన తన వ్యాఖ్యలను ఉసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ పనికిరాకుండా పోవడానికి బీఆరఎస్ కారణమని, ఇదే విషయాన్ని నిపుణుల కమిటీ కూడా చెప్పిందన్నారు.కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం ఓ ఏటీఎంలా వాడుకుంది. ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. రూ.లక్షకోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారు. కేసీఆర్‌ను జైల్లో పెడతానన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఏం చేశారు. ఆనాడు 7 మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారు. విలీనం తర్వాత కూడా సోనియాగాంధీ ఇంటికి ఆయన వెళ్లారని కిషన్‌రెడ్డి అన్నారు.

# పార్లమెంట్ సాక్షిగా అబద్ధాలు

- ఏడు మండలాల అప్పగింత బీజేపీ పుణ్యమే
- వికృతత్వాన్ని బయటపెట్టుకున్న కిషన్ రెడ్డి
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



**హ ైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయక వెన్నుచూపి పారిపోయిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్లమెంట్ సాక్షిగా మరోసారి ద్రోహానికి పాల్పడ్డారని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. రాజ్యసభలో కిషన్ రెడ్డి పచ్చి అబద్ధాలతో, చరిత్ర వక్రీకరణలతో తన లోపలి వికృతత్వాన్ని బయట పెట్టుకున్నారని ఆరోపించారు. ఏడు మండలాలను ఏపీకి అప్పగించాలనేది విభజన చట్టంలో ఉందని కిషన్ రెడ్డి పేర్కొనడం చారిత్రక అవాస్తవమే కాదు.. తెలంగాణకు చేస్తున్న తీరని ద్రోహమని అన్నారు. విభజన చట్టానికి సవరణ తెచ్చి ఆర్డినెన్స్ ద్వారా ఏడు మండలాలను ఏపీకి కట్టబెట్టింది ముమ్మాటికి బీజేపీ ప్రభుత్వమేనని విమర్శించారు. కాళేశ్వరం పై రేవంత్ చేస్తున్న దుష్ప్రచారాన్ని వల్లెవేస్తూ పార్లమెంట్‌లో విషం కక్కుతారా? నాడు కాళేశ్వరంపై ప్రశంసలు కురిపించి, నేడు రాజకీయ లబ్ది కోసం అబద్దాలా? తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తూ.. తెలంగాణ గొంతు కోస్తారా? అంటూ ప్రశ్నించారు. ఈ పాపంలో కిషన్ రెడ్డికి కూడా పాత్ర ఉందని పేర్కొన్నారు. చరిత్రను వక్రీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.పార్లమెంట్ సాక్షిగా చరిత్ర వక్రీకరణకు పాల్పడి తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించారని వెల్లడించారు. కాళేశ్వరంపై రేవంత్ రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే కిషన్ రెడ్డి పార్లమెంట్‌లో చేయడం కాంగ్రెస్, బిజేపీ చీకటి పొత్తుకు సాక్ష్యమని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అతి పెద్ద బహుళ దశల ఎత్తిపోతల ప్రాజెక్టుగా కాళేశ్వరం నిర్మించడం అబద్ధమా? 148 మీటర్ల దిగువ ప్రాంతం నుంచి 618 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయడం అబద్ధమా? . మండుటెండల్లో సైతం కాళేశ్వరం ప్రాజెక్ట్ కాల్వల ద్వారా జలాలు రైతుల పొలాలకు చేరుతుండటం అబద్ధమా? ఏది అబద్ధం కిషన్ రెడ్డి? అంటు నిలదీశారు. పంట పొలాల్లో పారుతున్న కాలేశ్వరం జలాలను చూపించేందుకు నేను సిద్ధం. వచ్చేందుకు మీకు దమ్ముందా? అంటూ సవాల్ విసిరారు. క్యాబినెట్ మంత్రిగా ఉండి, ఏ ప్రభుత్వం అయినా ప్రజా ధనంతోనే నిర్మాణాలు చేస్తుందన్న ఇంగితం మరిచి కేసీఆర్ జేబులోంచి డబ్బు ఖర్చు పెట్టారా అని అడగడం మీ అవివేకానికి, అతి తెలివికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. గతంలో బీజేపీ ప్రభుత్వ పెద్దలే నితిన్ గడ్కరీ నుంచి సీడబ్ల్యూసీ చైర్మన్ మసూద్ వరకు కాళేశ్వరంపై కురిపించిన ప్రశంసలు అబద్ధం అంటారా? అవివేకం అంటారా ? చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా' (చాప్టర్ 8) రిపోర్ట్ ప్రకారం.. 2014లో తెలంగాణలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం, 2023 నాటికి ఏకంగా 2.2 కోట్ల ఎకరాలకు పెరిగిందని, దీనికి ప్రధాన కారణం కేసీఆర్ నిర్మించిన 'కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ పథకాలే ' అని వెల్లడించడం మీ కళ్ళకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని, తెలంగాణకు నిధులు కేటాయించాలని ఎంపీ సురేశ్ రెడ్డి ఎంతో హుందాగా బాధ్యతగా మాట్లాడిన దాన్ని సమర్థించకపోగా ఉల్టా బాధ్యత మరిచి వ్యర్థ రాజకీయ ప్రేలాపనలకు పాల్పడ్డాడని హరీష్‌రావు విమరించారు. 8 మంది బిజేపీ ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉండి తెలంగాణ వాదాన్ని రిప్రెజెంట్ చేయకుండా సప్రెస్ చేస్తుండటం సిగ్గుచేటని పేర్కొన్నారు.

# ట్రాఫిక్‌పై పోలీసుల సర్వే

- వ్యక్తిగత వాహనాల వల్లనే రద్దీ
- గ్రూప్ ప్రయాణాలతో రద్దీ తగ్గుతుందని వెల్లడి

**హైదరాబాద్, మన చౌరాస్తా :** ఐటీ హబ్ పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని అరికట్టే వ్యూహంలో భాగంగా, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఆదేశాల మేరకు మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ పర్యవేక్షణలో సైబర్ టవర్స్ పరిసరాల్లో మార్నింగ్ పీక్ అవర్‌లో చేపట్టిన ఈ మాన్యువల్ సర్వేలో విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. కేవలం ఒక గంట వ్యవధిలోనే రోడ్డుకు నాలుగు వైపులా కలిపి 10,138 మంది సింగిల్ రైడర్లు (వాహనంలో ఒక్కరే ప్రయాణించేవారు) ప్రయాణించగా, డబుల్ రైడర్లు కేవలం 3,584 మంది మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. అంటే డబుల్ రైడర్ల కంటే సింగిల్ రైడర్లు 6,554 అధికంగా ఉండటం వల్ల రహదారులపై వాహనాల సంఖ్య అనూహ్యంగా పెరిగి తీవ్రమైన ట్రాఫిక్ జామ్‌లకు దారితీస్తోందని ఈ సర్వేలో స్పష్టమైంది. ఒక్కొక్కరు ఒక్కో వాహనంపై ప్రయాణించడం వల్ల ట్రాఫిక్ రద్దీ పెరగడమే కాకుండా, వ్యక్తిగతంగా కూడా ప్రయాణికులు అనేక ఇబ్బందులకు లోనవుతున్నారని పోలీసులు పేర్కొన్నారు. ప్రయాణ సమయం వృధా కావడంతో పాటు అదనపు ఇంధన ఖర్చులు, ప్రమాదాల రిస్క్, శారీరక అలసట వంటి సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. దీనికి తోడు వాహనాల నుండి వెలువడే కార్బన్ ఉద్గారాల వల్ల పర్యావరణ కాలుష్యం పెరిగి ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇవన్నీ తెలిసినప్పటికీ, అధిక శాతం మంది ఒంటరిగా ప్రయాణించడానికే మొగ్గు చూపడం ఆశ్చర్యకరమని, ఈ ధోరణి మారాల్సిన అవసరం ఉందని పోలీసులు అభిప్రాయపడ్డారు. ఈ సర్వే కార్యక్రమంలో ట్రాఫిక్ ఏడీసీపీ`ఎ హనుమంతరావు, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, మాదాపూర్ ఎస్ హెచఓ శ్రీధర్ కుమార్, ఆర్.ఐ శ్రీకాంత్, ఎసఐలు టీవీ రావు, రాములు సిబ్బంది పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఐటీ ఉద్యోగులు, సాధారణ పౌరులు తమ ప్రయాణాల్లో చిన్నపాటి మార్పులు చేసుకోవడం ద్వారా ట్రాఫిక్ రహిత సైబరాబాద్‌ను నిర్మించవచ్చని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని అధికారులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



### రణబాలిలో ఇంటెన్స్ లుక్‌లో

# విజయ్

విజయ్ దేవరకొండ హీరోగా, రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ అనంతపురంలో శరవేగంగా జరుగుతోంది. అయితే, తాజాగా ఈ షూటింగ్ స్పాట్ నుండి ఒక వీడియో లీక్ అయింది. ఇందులో విజయ్ దేవరకొండ మునుపెన్నడూ చూడని విధంగా చాలా ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్నాడు. లీకైన ఫుటేజీలో విజయ్ ఉగ్రరూపంతో కనిపిస్తున్నాడు. ముఖ్యంగా ఆయన డైలాగ్ డెలివరీ వాయిస్ మోడ్యులేషన్ పీక్స్‌లో ఉందనే చెప్పాలి. ఊర మాస్ డైలాగులు థియేటర్లలో విజిల్స్ వేయించడం ఖాయమనిపిస్తోంది. ఈ లీక్డ్ వీడియో చూస్తుంటే.. పవర్ ఫుల్ యాక్షన్స్ సీక్వెన్స్ తెరకెక్కిస్తున్నట్టుగా అనిపిస్తోంది. ఈ సినిమాలో విజయ్ బాడీ లాంగ్వేజ్, ఆ యాస ఆయన కెరీర్‌లోనే అత్యుత్తమంగా నిలుస్తాయని ఫ్యాన్స్ భావిస్తున్నారు. 'ట్యాక్సీవాలా' తర్వాత విజయ్`రాహుల్ సంకృత్యన్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. పైగా ఇందులో రష్మిక మందన్న కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు ఆకాశాన్నంటాయి. అయితే, లీకైన వీడియో చూసి ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నప్పటికీ, చిత్ర బృందం మాత్రం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ మధ్య వస్తున్న సినిమాలన్నీ కూడా ఇలాంటి లీకుల బారిన పడుతున్నాయి. మేకర్స్ ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న లీకుల బెడద తప్పడం లేదు. కానీ, రణబాలి లీక్ మాత్రం.. ఈసారి రౌడీ హీరో రష్మికతో కలిసి బిగ్ గెస్ట్ బ్లాక్ బస్టర్‌ను కొట్టడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**